తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శుక్రవారం 17 - 07 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 4

# ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేయాలి

- యాదాద్రి కలెక్టర్ అనురాగ్ జయంతి
- మాతాశిశు మరణాలు లేకుండా ప్రసవాలను ప్రోత్సహించాలి
- మోత్కూరు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



ప్రజావారధి/మోత్కూరు

ప్రభుత్వ ఆస్పత్రులకు వైద్యం కోసం వచ్చే ప్రజలను డాక్టర్లు, సిబ్బంది మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు కాకుండా ప్రభుత్వ ఆస్పత్రులకే రిఫర్ చేయాలని యాదాద్రి కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సబ్ సెంటర్ల నుంచి మండల కేంద్రాల్లో పీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రి, ఎయిమ్స్ వరకు ప్రభుత్వం ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతుందని, అన్నిరకాల రక్త పరీక్షలు చేస్తున్నారన్నారు. మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్ పరిశీలించి ముగ్గురు ఉద్యోగులు సెలవు పెట్టిన కారణాలను డాక్టర్ నిరోషాను అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఫార్మసీ, ల్యాబ్, టీకాల గదులను పరిశీలించి అవసరమైన మందులు, టీకాలు అందుబాటులో ఉన్నాయా, ఎన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారని సిబ్బందిని అడిగారు. రక్త నమూనాలు సేకరించి తీసుకెళ్లే మొబైల్ వాహనం రెండు రోజులుగా రావడం లేదని సిబ్బంది ఆయనకు చెప్పగా డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి అడిగారు. రోజూ ఓపీ ఎంత ఉంటుందని అడగ్గా సుమారు వంద వరకు ఉంటుందని చెప్పారు. టీ డయాగ్నస్టిక్, ఈ ఆరోగ్య పోర్టల్ ఆన్‌లైన్ నమోదు ఏ విధంగా చేస్తున్నారనేది చెక్ చేశారు. రక్త పరీక్షల కోసం ల్యాబ్‌లో లెటెస్ట్ మెషిన్ల కోసం డీఎంహెచ్‌వోకు రిఫర్ చేస్తానని చెప్పారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ఎందుకు నిరుపయోగంగా ఉందని అడగ్గా సంప్ నుంచి వచ్చే నీరు శుభ్రంగా లేదని చెప్పడంతో నీటి సంప్ శుభ్రంగా లేకపోవడంతో వెంటనే శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలను ఆదేశించారు. వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తెచ్చి తాగునీరు అందించాలన్నారు. గర్భిణిలకు అన్నిరకాల పరీక్షలు చేయించి మెరుగైన వైద్యం అందించాలని, మాతాశిశు మరణాలు లేకుండా ప్రసవాలను పెంచాలన్నారు. గత సంవత్సరం 27 డెలివరీలు చేశామని, ఈ సంవత్సరం 23 చేశామని డాక్టర్ చెప్పగా డెలివరీల శాతాన్ని ఇంకా పెంచాలన్నారు. ఆస్పత్రి ఆవరణతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని అనాజిపురం గ్రామంలో జంగాల కాలనీని సందర్శించి గుడిసెల్లో నివాసం ఉంటున్న కుటుంబాలతో మాట్లాడారు. రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులను కలిసి పనుల పురోగతి, బిల్లుల చెల్లింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.జ్యోతి, ఎంపీడీవో బాలాజీ నాయక్, ఆర్ఐ సుమన్, డాక్టర్ నిరోషా, ఆయుష్ డాక్టర్ వీణా, స్టాఫ్ నర్సు స్వాతి, సూపర్‌వైజర్ ఊర్మిళ, ల్యాబ్ టెక్నీషియన్లు జనార్ధన్, సునీత తదితరులు ఆయన వెంట ఉన్నారు.





# మోత్కూరు సెంటర్‌గా డీఎస్పీ ఆఫీస్ పెడితే బాగుంటుంది

## యాదాద్రి అడిషనల్ ఎస్పీ చే(బోలు లక్ష్మీనారాయణ

- పాత తాలూకా కేంద్రంగా మోత్కూరుకు ఎంతో పేరుంది
- గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం
- ఈగల్ టీంలతో స్పెషల్ ఫోకస్
- గంజాయి నేరస్తుల ఫింగర్ ప్రింట్స్, ఫొటోలు తీసుకుని నిఘా



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు సెంటర్‌గా డీఎస్పీ ఆఫీస్ పెడితే బాగుంటుందని, ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారుల స్థాయిలో ఆ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని యాదాద్రి అడిషనల్ ఎస్పీ చే(బోలు లక్ష్మీనారాయణ అన్నారు. మోత్కూరు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాత తాలూకా కేంద్రమైన మోత్కూరుకు ఎంతో పేరుందన్నారు. మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), మోటకొండూర్ మండలాలతో కలిపి మోత్కూరు సెంటర్‌గా డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. గంజాయి నేరస్తులు రకరకాల మార్గాల్లో గంజాయి సరఫరా చేస్తున్నారని, జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. గంజాయిని అరికట్టేందుకు ఈగల్ టీంలతో స్పెషల్ ఫోకస్ పెట్టామన్నారు. గంజాయి నేరస్తులు, గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఫింగర్ ప్రింట్స్, ఫొటోలు, చిరునామాలతో డాటా తీసుకుని వారిలో భయం కలిగేలా నిఘా పెడతామని చెప్పారు. యువత గంజాయి జోలికి వెళ్లవద్దని, దానికి బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటు తల్లిదండ్రులను క్షోభకు గురి చేయవద్దన్నారు. గంజాయి తాగితే పరీక్షల కోసం గంజాయి కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజల్లో పారదర్శకత కోసం పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు పెట్టామన్నారు. 100 కాల్ ద్వారా వచ్చే ఫిర్యాదుల్లో గోప్యత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్టేషన్ ఆవరణను, క్వార్టర్స్‌ను పరిశీలించారు. సీజ్ చేసిన వాహనాలకు క్రైం నంబర్లు అంటించాలని, కోర్టుల్లో పరిష్కారమైన కేసులకు సంబంధించిన వాహనాలను వెంటనే యజమానులను పిలిపించి ఇవ్వాలని ఆదేశించారు. సిబ్బంది క్వార్టర్స్, స్టేషన్ భవనం మరమ్మతుల కోసం కృషి చేస్తానన్నారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
శుక్రవారం


# బెస్ట్ అవైలబుల్ స్కీం అమలు చేయాలని కలెక్టర్‌కు వినతి

ప్రజావారధి/మోత్కూర్
నిరుపేద దళిత విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో చదువుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీంను అమలు చేయాలని కోరుతూ గురువారం మోత్కూరు వచ్చిన యాదాద్రి కలెక్టర్ అనురాగ్ జయంతికి తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కీంలో మోత్కూరు సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ ఉందని, ఆ స్కూల్ పరిధిలో ఉన్న నాలుగు మండలాల నుంచి 1వ తరగతి



నుంచి 5వ తరగతి వరకు ఎంపికైన విద్యార్థులను చేర్చుకోవడం లేదని తెలిపారు. తమకు ప్రభుత్వం నుంచి బకాయిలు రావడం లేదని, ఆర్థిక భారం పడుతుందని స్కూల్ యాజమాన్యం తమ పిల్లలను చేర్చుకోవడం లేదన్నారు. నిరుపేద దళిత విద్యార్థులు నష్టపోతున్నారని, స్కూల్ యాజమాన్యంతో చర్చించి స్కీం ద్వారా ఎంపికైన విద్యార్థులను చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్కీంపై పూర్తి వివరాలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొంట యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రత చట్ట సవరణను విరమించుకోవాలి

## పేదలు, వికలాంగుల పొట్టకొట్టొద్దు

### సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు



ప్రజావారధి/మోత్కూర్
జాతీయ ఆహార భద్రత చట్టంలో చట్ట సవరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోవాలని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో గురువారం సీపీఎం గ్రామశాఖ సమావేశం వెండి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార భద్రతా స్కీంలో అంత్యోదయ, అన్నయోజన ద్వారా పేదలు, వికలాంగులు పొందుతున్న 35 కేజీల బియ్యాన్ని తగ్గించడంతో పాటు అంత్యోదయ రేషన్ కార్డులను రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకే ఇప్పటి వరకు రేషన్ అందడం లేదని, అర్హులైన పేదలను గుర్తించి ఈ పథకాన్ని మరింతగా బలోపేతం చేయాల్సింది పోయి రద్దు చేయాలన్న ఆలోచన చేయడం అన్యాయమన్నారు. జాతీయ సమగ్ర కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో పేదరికంతో పిల్లలు ఎదుగుదల లేక, తక్కువ బరువుతో రక్తహీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యోదయ అన్నయోజన కింద పేదలు, వికలాంగులకు అందుతున్న 35 కిలోల బియ్యాన్ని తగ్గించి ప్రతి వ్యక్తికి ఏడు కిలోల చొప్పున ఇవ్వాలన్న ప్రతిపాదనతో పేదలకే ఎక్కువ నష్టం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని గొప్పలు చెపుతున్న మోడీ ప్రభుత్వం ఆహార భద్రత చట్టాన్ని ఎందుకు నిర్వీర్యం చేస్తుందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని బలోపేతం చేసి 35కిలోల బియ్యం పంపిణీని కొనసాగించాలని, తీవ్ర వైకల్యం ఉన్నవారికి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, కొంపల్లి గంగయ్య, దడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
17 - 07 - 2026

# అనుమతి లేకుండా హాస్టళ్లు నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో అనుమతులు లేకుండా హాస్టళ్లు నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ డిమాండ్ చేశారు. గురువారం మోత్కూరులోని కేఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల ఆవరణలోనే ఒకే ప్రాంగణంలో విద్యార్థిని, విద్యార్థుల హాస్టల్ నిర్వహిస్తున్నారని, విద్యాశాఖ అధికారుల కళ్లుగప్పి నిబంధనలకు విరుద్ధంగా ఒకే భవనంలో బాల బాలికల హాస్టళ్లు నడుపుతున్నారని తెలిపారు. ఈ విషయంపై కలెక్టరేట్‌లో కూడా ఫిర్యాదు చేశామని, అధికారులు ప్రైవేట్ స్కూళ్లను సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్ట గౌతం, వంశీకృష్ణ, ఉప్పుల ప్రవీణ్, చందు తదితరులు పాల్గొన్నారు.